


నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

**ఆదిలాబాద్**

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

సోమవారం 08 డిసెంబర్ 2025 పేజీలు 03


### స్థానిక సమరానికి
# శాఖలు సమాయాత్తం

● శాంతియుత వాతావరణంలో ఎన్నిక నిర్వహణకు కసరత్తు ● పోలీసు బలగాలతో విస్తృత తనిఖీలు ● జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు ● వాహానాల రాకపోకల పై ప్రత్యేక నిఘా ● స్థానిక సంస్థల ఎన్నికల పై డేగ కళ్ళతో పోలీసుల నిఘా ● సమస్యాత్మక కేంద్రాల పై ప్రత్యేక నిఘా ● మొదటి విడతలో 90 స్థానాలకు పోలింగ్ ● 139 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ● నగదు,మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా







**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశానుసారం అన్ని శాఖలలు సమాయాత్తం అయ్యాయి.గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహణకు పోలీసు శాఖా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నది.జిల్లా సరిహద్దు ప్రాంతాల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి రాకపోకలను కొనసాగిస్తున్న వాహానాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు ఎం.ఎం.సి.ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రధాన రహదారుల పై నిఘా ఉంచేందుకు ఎస్.ఎన్.టి.పోలీసు శాఖ స్టాటికల్ సర్వేయ్ లైన్స్ టీంలు (ఎప్ఎస్‌టి) మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసారు.ఎగ్జిక్యూటీవ్ మెజిస్ట్రేట్ (ఎంఆర్ఓ.),పోలీసు శాఖకు చెందిన ఒక ఎస్సై.,ఏఎస్సై స్థాయి అధికారి,జిల్లా వ్యాప్తంగా అదనపు కలెక్టర్,ఆర్డీఓలు ప్రత్యేక పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేసారు.జిల్లాలో డిసిపి నేతృత్వంలో ముగ్గురు ఏసిపి.లు,15మంది సిఐలు.ముప్పై మంది ఎస్సైలు,వంద మంది ఏఆర్ సిబ్బంది,200 మంది యుఆర్టిఐ సిబ్బంది,800 మంది సివిల్ పోలీసులతో ఎన్నికల బందో బస్తునుకు ఏర్పాటు చేస్తున్నారు.

**సమస్యాత్మక ప్రాంతాల పై ప్రత్యేక నిఘా....**

జిల్లాలోని గత అనుభావాల నేపద్యంలో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన ప్రాంతాలలో పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడంతో పాటు గతంలో అల్లర్లకు కారకులైన వారిని బైండోవరు చేయడంతో పాటు వారి కదలికల పై ఎప్పటి కప్పుడు నిఘాను ఉంచుతున్నారు.రాత్రి వేళల్లో సైతం వారి కదలికల పై పర్యటించి వారికి కౌన్సింగ్‌ను పోలీసులు ఇస్తున్నారు.దీంతో సమస్యాత్మక ప్రాంతాలలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి.

**మద్యం,నగదు పై ప్రత్యేక నిఘా....**

స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు ఏలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పపడకుండా ఉండేందుకు జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహానాలను తనిఖీ చేసి పంపుతున్నారు.దీంతో ఎన్నికలలో మద్యం,నగదు పంపిణీని అడ్డు కట్ట వేయడానికి ఈ చెక్ పోస్టులు ఉపయోగపడుతున్నాయి.అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పోలీసు సిబ్బంది సైతం వారి ప్రయత్నాలను వారు చేస్తూనే ఉన్నారు.

# ఇదండీ.. పరిస్థితి !

**ఆశ బారెడు.. ఆస్తి మూరెడు**



లక్షెట్టిపేట,డిసెంబర్07,సూర్య మేజర్ న్యూస్

చేతుల ఐదు పైసలు లేవు. సర్పంచ్ ఎలక్షన్లు రానే వచ్చె. పంట చేతికి వచ్చే సమయంలో సెడగొట్టు వాన పడి పంట దిగుబడి తగ్గింది. ఉన్న కాస్త పంటను అమ్ముదామంటే కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కొంటలే. ఎలచ్చన్లలో పోటీ చేద్దామంటే పైసలు కావాలి. దీంతో సర్పంచ్ గా పోటీచేసేందుకు అభ్యర్థులు పైసల కోసం ఆసామీల దగ్గరికి లైన్ కడ్తుండ్రు. నూటికి రెండు, మూడు రూపాయల వడ్డీ అయినా సరే.. వడ్లు అమ్మగానే కట్టేస్తా అని ఒప్పందం చేసుకుంటున్నరు. ఆఖరుకు ఇంట్ల ఉన్న బంగారం అమ్మి పోటీ చేద్దామంటే ఇంట్లో పెండ్లాంతొ లొల్లి... ఆఖరికి ఉన్న ఎకరం అమ్ము దామంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తుట్టికి పావుశేరు అడుగుతుండ్రు. ఇగ నామినేషన్ వేసిన కొందరు మరీ ఇబ్బంది పడుతున్నరు. పోటీలో ఉన్నట్లు అందరికీ తెలిసే.. పైసలు పుట్టక ఎనక్కి తగ్గితే విలువ ఉండదని చుట్టుపక్కల వారి గోల. దీంతో రాత్రుల్లో నిద్ర పట్టడం లేదని పలువురు అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉంది గ్రామాల్లో పలువురు అభ్యర్థుల పరిస్థితి.

## ప్రలోబాలకు లొంగ కుండ. .ఓటును వినియోగించు కోవాలి

**- కేస్లాపూర్,భీమిని,లలో.. ఫ్లాగ్ మార్చ్**




### ఎన్నికల నిబంధనలు కఠినంగా
# అమలు చేయబడతాయి
**- దేవాపూర్ ఎస్సై గంగారాం**



**కాసిపేట, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్**

పంచాయతీ ఎన్నికల నేపద్యంలో ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేయబడతాయని దేవాపూర్ ఎస్సై గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా అనవసర గుమిగూడుడు, ర్యాలీలు,భారీ సమూహాలు ఏర్పాటు చేయడం నిషేధమని,ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన జరిగితే వెంటనే కేసులు నమోదు చేయబడతాయని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం లౌడ్‌స్పీకర్లు, ప్రచారం నిషేధిత సమయాల్లో పూర్తిగా నిషేధితమని, ఓటర్లపై బెదిరింపులు, ప్రలోభాలు, ఒత్తిళ్లు ఏవైనా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని,సోషల్ మీడియా,వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం, పుకార్లు, రెచ్చగొట్టే సందేశాలు పంపితే తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, సామాజిక మాధ్యమాల్లో ఉన్న అన్ని గ్రూపుల నిర్వాహకులు (అడ్మిన్‌లు) తమ గ్రూపుల్లో పోస్టయ్యే, షేర్ అయ్యే ప్రతి సందేశానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని, వివాదాలు సృష్టించే, ఉద్రిక్తత పెంచే, తప్పుడు ప్రచారానికి దారితీసే, చట్టవిరుద్ధమైన పోస్టులను అనుమతించరాదని, గ్రూపులను జాగ్రత్తగా పర్యవేక్షించి,ఎన్నికల శాంతి భద్రతలకు భంగం కలిగించే సందేశాలను వెంటనే తొలగించాలని,నిబంధనలు పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని,గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

### పల్లెల్లో ఊపందుకున్న
# ఎన్నికల ప్రచారం



**ఖానాపూర్ టౌన్ డిసెంబర్ 7 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పల్లెల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నువ్వా నేనా అన్నట్లు ప్రచారం సాగుతుంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు నానాపాట్లు పడుతున్నారు. కొందరు వాగ్దానాల మీద వాగ్దానాలు చేస్తున్నారు. మరికొందరు మందుతో విందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడక్కడ డబ్బులు సైతం పంచుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో భాగంగా వీధి వీధి తిరుగుతూ, ప్రతి ఇంటి తలుపు తట్టుతూ ఓట్లు తమ గుర్తుకే వేయమని ప్రాధేయ పడుతున్నారు. గెలిచిన తర్వాత మీకు ఇది చేస్తాం, అది చేస్తాం అంటూ ప్రమాణాలు చేస్తున్నారు.



ప్రజలను ఆకట్టుకునే పాటలతో ప్రచార హెూరు పల్లెల్లో కనిపిస్తుంది. ఆ గట్టునుంటావా రాజన్న ఈ గట్టునుంటావా, కదలిరండి ప్రజలారా ఓటు వేయడానికి మంచి వాడికి ఓటు వేసి మన సత్తా చాటుదాం అనే పాటలతో ప్రచారం రసవత్తరంగా సాగుతుంది. ఒక్కొక్క వ్యక్తి తన వాగ్దానాలను పాటల రూపంలో ప్రజలకు వినిపిస్తున్నాడు. పల్లెల్లో ఎన్నికలు పండుగ వాతావరణం ను తలపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో పెద్దలతో పాటు పిల్లల సైతం జెండాలు పట్టుకుని పాల్గొంటున్నారు. మా నాన్నకు ఓటేయ్యు అక్క, మా నాన్నకు ఓటేయ్యు తాత,మీ ఓట్లతో గెలుస్తాడు మా నాన్న అంటూ ఇంటింటికి తిరిగి చెబుతున్న పిల్లల అమాయకపు పలుకులు చూడముచ్చటగా ఉంటున్నాయి. ఇలా ఏ వీధిలో చూసిన, ఏ ఇంటి వద్ద చూసినా ప్రచార హెూరు ఎన్నికల పోరు కనిపిస్తుంది. చిన్నలు పెద్దలు అందరు కలిసి పాటలకు అనుగుణంగా డ్యాన్సులు చేస్తూ సాగుతున్న ప్రచార హెూరును చూస్తుంటే ఔరా ఇది ఏమి విచిత్రం అనిపిస్తుంది. ప్రచార జోరు సాగుతున్నప్పటికీ ఓటర్ నాడీ అర్థం కావడం లేదని అభ్యర్థులు వాపోవడం కోసమెరుపు.

# ప్రలోబాలకు లొంగ కుండ. .ఓటును వినియోగించు కోవాలి

## - కేస్లాపూర్,భీమిని,లలో.. ఫ్లాగ్ మార్చ్

**భీమిని,డిసెంబర్7,సూర్య మేజర్ న్యూస్:**

జరుగ బో యే సర్పంచ్ ఎన్నికలలో ఓటర్లు ప్రలోబాలకు లొంగకూండ ఓటు హక్కును వినియోగించు కూవాలని తాండూర్ సిఐ.దేవయ్య సూచించారు ఆదివారం రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మంచిర్యాల డిసిపి ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, తాండూర్ సిఐ దేవయ్య అధ్యర్యంలో తాండూర్ సర్కిల్లోని భీమిని పోలీసుస్టేషన్ పరిధిలో లోని సమస్యాత్మక గ్రామ పంచాయతీ కేస్లాపూర్ తో పాటు భీమిని మండల కేంద్రం లో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన సందర్భంగా సిఐ ప లు చూచనలు చేశారు.ఈ నెల 14 వ తేదీన జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు వారి వారి



ప్రచారాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అనవసరమైన గొడవల జోలికి వెళ్లి కేసుల్లో ఇరుకొని యువత భవిషత్ చెడగొట్టుకోవద్దని కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగం రావడానికి అవకాశం లేకుండా పోతుందనీ ఈ విషయాన్ని గుర్తుంచుకొని ప్రతి ఒక్కరు జాగర్త ఉండాలి సూచించారు ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు ను స్వచ్ఛందంగా ఎవరి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించు కోవాలనీ ఓటింగ్ కోసం పోలీస్ తగినంత బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎలక్షన్ కు సంబంధించినటువంటి ఎటువంటి ఫిర్యాదు నైనా డైల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని సిఐ తెలిపినారు. సి ఐ వెంట భీమిని ఎస్ ఐ విజయ్ కుమార్ కన్నెపల్లి ఎస్ ఐ భాస్కర్ రావు, మందారం ఎస్ ఐ సౌజన్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యునికి సన్మానం

**మంచిర్యాల, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్**

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మంచిర్యాల జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు గా ఇటీవల ఎన్నికైన బిజెపి జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్యను బిజెపి రాష్ట్ర నాయకులు, పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి గోమాసే శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆదివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం , జిల్లా కలెక్టర్ ఆయనను నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ దళితుల సమస్యల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎల్లయ్యను ఆ పదవిలో నియమించడం హర్షణీయం అన్నారు. ఆయన ఎన్నికైనందుకు అభినందించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం కృషి చేయాలని సూచించారు.



## బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

**కాసిపేట, డిసెంబర్ 7,సూర్య మేజర్ న్యూస్ :**



కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మడావి అనంతరావు ప్రచారం చాశారు. తనకు కేటాయించిన స్పానర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాకు వచ్చే జీతం పేద ప్రజలకు ఖర్చు చేస్తా... సర్పంచ్ అభ్యర్థి గాజుల శ్రీనివాస్

**ఖానాపూర్ టౌన్ డిసెంబర్ 07 సూర్య మేజర్ న్యూస్**

తాను సర్పంచ్ గా గెలిస్తే తనకు వచ్చే జీతం పేద ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తానని సుర్జాపూర్ సర్పంచ్ అభ్యర్థి గాజుల శ్రీనివాస్ అన్నారు. సుర్జాపూర్ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామమును రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తానని, సొంత డబ్బులతో గ్రామంలోని విద్యార్థులందరికీ గురుకుల, నవోదయ, సైనిక్ స్కూల్ కోచింగ్ ఇప్పిస్తానని, ప్రతి వీధిలో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మింప చేస్తానని, కులమతాలకతీతంగా ప్రజలు కలిసి ఉండేలా కృషి చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని, గ్రామంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని, సీసీ కెమెరాలు పెట్టిస్తానని అన్నారు.




# కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించిన సి ఐ

**చింతలమానేపల్లి,డిసెంబర్7,సూర్య మేజర్ న్యూస్**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశానుసారం కాగజ్ నగర్ డీఎస్పీ పర్యవేక్షణలో కౌటాల సి ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో చింతలమానెపల్లి మండలం రణవెల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 50 వాహనాలను తనకి చేసి సరైన పత్రాలు లేని వారికి జరిమాన విధించడం



జరిగింది.20 లీటర్ల గుడంబా స్వాధీన పరుచుకొని 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ సంతోష్ కుమార్ తో పాటు ఎస్ఐ లు ఇస్లావత్ నరేష్, చంద్రశేఖర్, సురేష్, సర్ధార్ పాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుండే పోటుతో మరణించిన మిత్రునికి ఆర్థిక చేయూత

**నస్పూర్, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ పట్టణంలోని శ్రీరాంపూర్ కొత్త రోడ్ గణేష్ నగర్కు చెందిన, ఆటో డ్రైవర్ కాల్వ రాజన్న ఇటీవల గుండే పోటుతో మరణించినాడు. గణేష్



నగర్ కి చెందిన మిత్రబృందం సభ్యులు సభ్యులు 1.41 లక్షల ఫిక్స్ డిపాజిట్ బాండ్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో నన్న వేన సతీష్,మోహన్, రామ్మూర్తి, రమేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 108 లోనే ప్రసవం.. తల్లిబిడ్డ క్షేమం



**పెంచికల్ పేట్ ,డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్:**

పెంచికల్ పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన శ్రీదేవి (భర్త అనిల్) గర్భిణి మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. వెంటనేస్పందించిన సిబ్బంది ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కాగజ్నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనేశిశువుకు జన్మనిచ్చిందనీ తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ చంద్రకాంత్ ఈ విషయాన్ని వెల్లడించారు. వారిని కాగజ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చినట్లు తెలిపారు.

# పల్లెల్లో..జోరుగా ప్రచార సందడి

**- 12 గ్రామపంచాయతీలో పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్న 49 మంది సర్పంచ్ అభ్యర్థులు - పెంచికల్ పేట్ మండలం లో ఎన్నికల గుర్తులు కేటాయింపు - మద్దతును కూడగట్టేందుకు కుల సంఘాలకు గాలం**

**- పగలంతా పొలంలో సాగు పనులు..రాత్రి ప్రచారంతో బిజబీజీ- విమర్శలు.. ప్రతి విమర్శలతో హీటెక్కుతున్న పల్లె రాజకీయం**

**పెంచికల్ పేట్ ,డిసెంబర్ 7,సూర్య మేజర్ న్యూస్:**

పెంచికల్ పేట్ మండలంలో 12 గ్రామపంచాయతీలో 49 మంది సర్పంచ్ అభ్యర్థులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఎన్నికల బరిలో నిలవడం ఖాయమని తేలిపోవడంతో ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు స్థానిక ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు పోటాపోటీగా వారివారి ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తూ దూసుకు పోతున్నారు. ఇంటింటి ప్రచారంతో పాటు వాల్ పోస్టర్స్, ప్రత్యేకంగా బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సర్పంచ్ పదవులతో పాటు వార్డు మెంబర్ పదవులకు తీవ్రమైన పోటీ కనిపిస్తుంది. ఈసారి యువకులే ఎక్కువగా పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామ అభివృద్ధిని చేసి చూపుతామంటూ నమ్మబలుకుతున్నారు.

### గుర్తులతో ఓటర్ల వద్దకు..

ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు మెం బర్ అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో ఓటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అభ్యర్థులకు ఉంగరం, కత్తెర, బ్యాట్, గౌను, గ్యాస్స్టవ్, ఫోట్బాల్, ఇలా రకరకాల గుర్తులను కేటాయించారు. తమ గుర్తును గుర్తంచుకోవాలంటూ ఓటర్లకు ప దేపదే సూచిస్తున్నారు. కొందరైతే డమ్మీ గుర్తులతో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నా రు. చివరి సమయంలో గుర్తులను ఓటర్లకు ఉచితంగా పంపిణీ చేసే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. భారీ మొత్తంలో కొనుగోలు చేస్తూ డంప్ చేసుకుంటున్నారు. డమ్మీ బ్యాలెట్ పత్రాలను ముద్రించి ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. రెండవ విడతకు సంబంధించిన గుర్తులను శనివారం కేటాయించనున్నారు.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో అన్ని గ్రామాల్లో సందడి వాతావరణమే కనిపిస్తుంది.

### గంప గుత్తా ఓట్లే టార్గెట్...



కుల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న అభ్యర్థులు వారి మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా గంపగుత్తగా ఓట్లను రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. కుల సంఘాల వారీగా సమావేశాల ను నిర్వహిస్తూ వారికి అవసరమైన ఆఫర్ చేస్తున్నారు. మందు విందు దావతులతో హల్చల్ చేస్తున్నారు. కుల సంఘాలకు అవసరమన వంట పాత్రలు, టెంటు సామగ్రి ఇతర పరికరాలను కొనిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల సంఘ భవనాలు, ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఒప్పంద పత్రాలు రాసుకుంటున్నారు. గంపగుత్తగా వచ్చే ఓట్ల ను టార్గెట్ చేస్తూ దేనికైనా రెడీ అంటూ నమ్మబలుకుతున్నా రు. అయితే అం దరికీ ఒకే అంటున్నా ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో? అర్థం కాని పరిస్థితులు ఉన్నాయంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### పొద్దంతా పొలానికి.. రాత్రి ప్రచారం

పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థు లు సాగు పనులతో పాటు ఎన్నికల ప్రచారంపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. పొద్దంతా పొలం బాట పడుతున్నా.. రాత్రివేళల్లో విస్తృతంగా ప్ర చారాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళలోనే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సందడి కనిపిస్తుంది. కొందరైతే సాగు పనుల కోసం ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటున్నారు. వ్య వసాయ పనులు చేస్తునే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అటు సాగు పనులు ఇటు ఎన్నికల ప్రచారంతో బిజిబిజీగా మారిపోతున్నారు.ప్రస్తుతం గ్రామాల్లో వరి కోతలు, పత్తి ఏరే పనులు కొనసాగుతున్నాయి. ఎన్నికల బిజీతో వ్యవసాయ పనులు వెనుకబడి పోతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అభ్యర్థులైతే వ్యవసాయ పనులను వదిలేసుకుం టూ ఎన్నికల పైనే ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. పంట దిగుబడులు చేతికి రావడంతో ఎన్నికలకు ఎలాంటి పైసల కొదవ లేదంటున్నారు. ఎన్నికల ఖర్చుల కోసం అభ్యర్థులకు అప్పులిచ్చేందుకు కొంతమంది రైతులు ముందుకు వస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల హడావిడి మొదలు కావడంతో విమర్శలు ప్రతీ విమర్శలతో పల్లె రాజకీయం హీటెక్కుతోంది. మరి 14వ తారీఖున ఎవరిని విజయాలు వారిస్తాయో వేచి చూడాలని ప్రజలు తెలిపారు.

# 29 కార్మిక చట్టాలను అమలు చేయాలి

## -ఏఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ సమావేశం

**శ్రీరాంపూర్ డిసెంబర్ 07 సూర్య మేజర్ న్యూస్:**

అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఏఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్న కుమార్ అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష - కార్యదర్శులు వై. మల్లేష్, జి. అంజయ్య పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని - 29 కార్మిక చట్టాలను అమలు పర్చాలని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ మోడీ - అమీషా ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ కార్మికులు అనేక ఉద్యమాలు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా




మార్చి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న పరిశ్రమంలో అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ అఖిల భారత స్థాయిలో అన్ని కార్మిక సంఘాలు ఫెడరేషన్లు కార్మిక ఉద్యోగ సంఘాలు అనేక నిరసనలు భారత్ బందులు, టోకెన్ సమ్మెలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసినప్పటికీ కార్మికుల అభిష్టానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టి. కార్మిక వ్యతిరేక ఈ నాలుగు లేబర్ కోడ్స్ ను (21 నవంబర్ 2025) రోజు నుండి అమలులోకి తెచ్చి మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడడానికి భారత రాజ్యాంగంలో కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పొందుపరచుకున్న కార్మిక చట్టాలను హిందుత్వ మతోన్మాద బిజెపి మోడీ - అమీషా ప్రభుత్వం భారత కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నమని చెప్తూ మరోవైపు లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూసివేస్తూ ఆదాని - అంబానీ ల బడా పారిశ్రామిక వేత్తలకు అమ్మివేస్తూ కార్మికులను కార్మిక కుటుంబలను రోడ్డుమీదికి నేటి వేస్తూ అన్ని రంగాల ప్రజలను సంక్షోభములకు నెడుతు భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి భారత



కార్మిక వర్గం ప్రశ్నించే హక్కు లేకుండా ప్రశ్నించే కార్మికులను ఎలాంటి సమాధానాలు లేకుండా నేరుగా ఉద్యోగం నుండి తొలగించే విధంగా బ్రిటిష్ వారిని మై మరిపించే విధంగా కార్మిక చట్టాలను మారుస్తు కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను అమల్వరుస్తూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చుడానికి ప్రయత్నం చేస్తున్నా మోడీ విధానానకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు పర్చాలని నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపియాలని కార్మికులు కార్మిక సంఘాలు ఐక్యంగాక నాలుగు లేబర్ కోడ్స్ ను ఎత్తివేసి 29 కార్మిక చట్టాలను అమలుపరిచే వరకు ఉద్యమించాలని రాష్ట్ర కమిటీ తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు. ఏం. రాయమల్లు ఏం. పోచమల్లు, జి. రాములు, సామల అనసూర్య, వెంకటలక్ష్మి, లక్ష్మి, రాజేశ్వరి, లత, కే. రాము, చంద్రగిరి, శంకర్, కుర్తి లింగం, కిష్ట స్వామి తదితరులు పాల్గొనడం జరిగింది.

## టీఎస్ యుటిఎఫ్ కమిటీ ఎన్నిక

**కాసిపేట, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండల టీఎస్ యుటిఎఫ్ కమిటీని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కె రమేష్, ప్రధాన కార్యదర్శి బి రాజకుమార్, ఉపాధ్యాక్షులు బాబు సింగ్, ఉపాధ్యాక్షురాలు నవీన, కోశాధికారి పద్మ, కార్యదర్శి అన్నపూర్ణ,ఆడిట్ కమిటీ కన్వీనర్ సాహితి,ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ సునీత, మహిళా కమిటీ కన్వీనర్ రాధిక, క్రీడా కమిటీ కన్వీనర్ గంగాభవాని, అకాడమిక్ కమిటీ కన్వీనర్ సులోచన,ఐఓటిటి కన్వీనర్ తిరుపతి,సాంస్కృతి కమిటీ కన్వీనర్ సుచరిత లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో కి చేరికలు

**కాసిపేట, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలో శనివారం కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరిగాయి. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్కే కరీం, గంగాధరి రాజేశం లు



కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. వారికి మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పుస్కూరి విక్రమ్ రావు, మైదం రమేష్, గోలేటి స్వామి, వేణు, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ బూతులను సందర్శించిన ఎసిపి

**జన్నారం, డిసెంబర్ 07, సూర్య మేజర్ న్యూస్**

జన్నారం మండలంలో ఈనెల 11న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఆదివారం మంచిర్యాల్ ఏసీబీ ప్రకాష్ పలు సమస్యాత్మక పోలింగ్ బూతులను సందర్శించారు. పూర్తిగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న కవ్వాల్, బంగారు తండా, హాస్టల్ తండా, రెండ్లగూడ గ్రామాలలో సందర్శించారు. బంగారు తండాలో గ్రామస్తులతో ఎసిపి ప్రకాష్ మాట్లాడుతూ పోలింగ్ రోజు



ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాత్రమే ఓటు వేసుకోవడానికి అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ నచ్చిన వ్యక్తికి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఓటు తమకే వేయాలని ఎవరైనా బెదిరిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష ఉన్నారు.

## ఉపయోగపడుతున్న షీ టీం అవగాహన సదస్సులు

### -షీ టీం అవగాహనతో రెండు బాల్యవివాహాల నిలిపివేత

### -షీ టీం సభ్యులకు స్వచ్ఛందంగా సమాచారం అందజేస్తున్న విద్యార్థులు

### -అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

### -షీ టీం ఇన్చార్జ్ బి సుశీల

**మావల, డిసెంబర్ 07, సూర్య మేజర్ న్యూస్**

షీ టీం బృందం మావల మండలంలోని ఒక ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థులకు బాల్య వివాహాలపై, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై, విద్యార్థినుల పట్ల జరుగు అఘాయిత్యాలపై, అవమానాలపై, వేధింపులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆదిలాబాద్ షీ టీం బృందం ప్రతీ రోజు జిల్లాలోని హాట్ స్పాట్స్ లు మహిళల పట్ల జరుగు నేరాలను అదుపు చేస్తూ, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలను సందర్శిస్తూ యువతులకు మహిళలకు విద్యార్థినిలకు నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తుంది. ఇందులో భాగంగానే మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఒక పాఠశాల లో అవగాహనలో విద్యార్థులకు తమ పాఠశాల స్నేహితురాలు ఇద్దరూ విద్యార్థులకు బాల్యవివాహాలు నిశ్చయమైన విషయాన్ని తెలియజేయడంతో, వెంటనే అప్రమత్తమైన షీ టీం బృందం విద్యార్థినుల వివరాలను తెలుసుకొని, జిల్లా సి డబ్ల్యూ సి వారి సమక్షంలో, విద్యార్థినిల కుటుంబ సభ్యులకు బాల్యవివాహాలను చేయడం నేరమని అవగాహన కల్పించడంతో, చైతన్యవంతులైన తల్లిదండ్రులు బాల్య వివాహాలను నిలిపివేయడం జరిగింది. . షీ టీం సభ్యులు అవగాహన చేపట్టడంతో విశేష స్పందన వస్తుందని, షీ టీం బృంద సభ్యుల అవగాహన కార్యక్రమంలో సత్ఫలితాలు లభిస్తున్నాయని, ఈ విషయంపై షీ టీం బృంద సభ్యులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో షీ టీం బృంద సభ్యులు ఎఎస్ఐ సుశీల హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎల్కపల్లి బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థికి

## యువకుల ఆర్థిక సాయం

**పెంచికల్ పేట్, డిసెంబర్ 07, సూర్య మేజర్ న్యూస్**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కోనేరు కోనప్ప బలపరిచిన ఎల్కపల్లి అభ్యర్థి కాశిపాక రాకేష్ కోసం పెంచికల్ పేట్ మండలంలోని ఎల్కాపల్లి గ్రామ యువకులు ముందుకొచ్చి ఎన్నికల ఖర్చు నిమిత్తం విరాళాలు అందజేసారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత అధికారులు, కార్యకర్తలు రాకేష్ ని బారీ మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధి చేయాలని ఆశాభావాలు వ్యక్తం చేశారు. రాజకీయ వాతావరణంలో గ్రామ స్థాయి అభ్యర్థుల కోసం యువత సంఘటనతో కూడిన విరాళ సమర్పణ ఒక మంచి సంకేతంగా కనిపిస్తోందనీ దీనివల్ల రాకేష్ ప్రచారానికి బలం చేకూరుతుందని యువకులు అన్నారు. ఈ కార్యక్రమం లో కోనేరు యువకులు పాల్గొన్నారు.



### బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిన

## తాజా మాజీ జెడ్పిటిసి నల్ల వనిత

### పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికిన

### బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గండ్రత్ సుజాత

**మావల, డిసెంబర్ 07, సూర్య మేజర్ న్యూస్**

ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. ఈ రోజు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ



తాజా మాజీ జెడ్పిటిసి నల్ల వనిత-రాజేశ్వర్ వారితో పాటు ముఖ్య నాయకులు మోసిన్, దోసలి సంతోష్, కలగటు గంగన్న, సునీల్, ఎరా గంగన్న, రొడ్డ ప్రదీప్ తో పాటు దాదాపు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, గండ్రత్ సుజాత వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు వరాల జల్లు కురిపించడంతో పటు, ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై చేరుతున్నట్లు తెలిపారు.

## మిత్రుని అంత్యక్రియలకు ఆర్థిక చేయూత

**బోథ్, డిసెంబర్ 7, సూర్య మేజర్ న్యూస్**

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా. రక్త సంబంధాలు బంధుత్వం కంటే స్నేహానికి మించినది ఏది లేదు అని అంటారు. స్నేహితుని కుటుంబం ఎప్పుడూ బాగుండాలని కోరుకునేది స్నేహితులే. ఈ క్రమంలోనే తమ స్నేహితుడు అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో తమతో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న మిత్రుని కుటుంబానికి ఆర్థిక దన్నుగా నిలిచారు. ఒకసారి వివరాలు లోకి వెళ్తే బోథ్ మండలంలోని దన్నూరు బి గ్రామానికి చెందిన భుక శేఖర్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. 1997- 98 పదవ తరగతి విద్యార్థులు తమతో పాటుగా కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందడంతో కలత చెందారు. దీంతో తమ మిత్రుని కుటుంబ పరిస్థితి తెలుసుకొని, మిత్రుని అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేసి తమ పెద్దమనుషులు చాటుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫినగరంలో ఆయన అంతక్రియలలో మిత్రులు పాల్గొని పాడేమోసి మిత్రునిపై తమ ప్రేమను చాటుకున్నారు. భవిష్యత్తులో తమ మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 97-98 సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.



## జన్నారంలో హొరాహొరీగా ఎన్నికల ప్రచారం

**జన్నారం, డిసెంబర్ 07, సూర్య మేజర్ న్యూస్**

జన్నారం మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా లోత్రొర్రే, లింగయ్య పల్లె రెండు గ్రామాలు ఏకగ్రీవంగా కాగా, మిగతా 27 పంచాయతీలకు ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. మండలానికి ముఖద్వారం అయినా పొనకల్ మేజర్ పంచాయతీలో తొమ్మిది నామినేషన్లు వేయగా, ఆరుగురు ఉపసంహరించుకోగా కేవలం ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పోటీలో ఉన్నారు. పొనకల్ జనరల్ మహిళకు కేటాయించగా తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ భార్య జక్కు సుష్మా భూమేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుల్వ జనార్దన్ భార్య సుల్వ శైలజ జనార్ధన్, అలాగే మాజీ సర్పంచ్ దర్శనాల అనసూయ మల్లేష్ లు పోటీ పడుతున్నారు. నువ్వా నేనా అనే రీతిలో ప్రచారాలు చేస్తున్నారు. ఈ ముగ్గురిలో గ్రామ ప్రజలు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే. అదేవిధంగా రేండ్లగూడ, కామన్ పల్లి, చింతగూడ, కలమడుగు, కిష్టాపూర్, రాంపూర్, తొమ్మిది గుడిసెల పల్లె, జన్నారం తదితర గ్రామాలలో హొరాహొరీగా ప్రచారం జరుగుతుంది. ఈ ఎన్నికల పోలింగ్ కేవలం మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున ప్రచారం చేసే కార్యకర్తలు తెలతెలవారకముందే ఓటరు మహాశయుల ఇంటి వద్దకు చేరుకొని ఓట్లు అడుగుతున్నారు. ఇక అన్ని గ్రామాలలో పోటీలో ఉన్న అభ్యర్థులు మద్యం పంచడానికి సిద్ధమై ఇతరులకు అనుమానం రాకుండా రహస్య ప్రాంతాల్లో దాచిపెడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అంతేకాకుండా డబ్బులు సైతం పంచడానికి సిద్ధమైనట్లు ప్రతి ఒక్కరి నోటా వినిపిస్తోంది. పొనకల్ మేజర్ పంచాయతీలో అధికారికంగా ఉన్న ఓట్లు వైశ్యులు మరియు మహేంద్రులు ఉన్నారు. రంగంలో ఉన్న ముగ్గురిలో మహేంద్రులు ఎటువైపు మొగ్గుచూపితే అటువైపే గెలుపు ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆయా గ్రామాలలో ప్రజలు ఎవరికి పట్టం కడతారు ఎవరిని చీకొడుతారో ఈనెల 11న తేలనుంది.